# అసలేం జరిగింది ..?!
# ఆ ఇంట్లో దెయ్యం వుందా ..?!

REAL STORY-1




విశాలమైన నగరం .. నియాన్ లైట్ల వెలుగులో అసలెక్కడా కనిపించని నింగి నక్షత్రాల కింద మత్తుగా నిద్ర పోతోంది ... వయసు కసితో రెచ్చిపోయే చాలామంది కుర్రాళ్ళు .. ఇంకా యంగ్ ఏజ్ లోనే ఆగిపోయి తామింకా జోరు మీద వున్నామనుకునే ''యువ వృద్ధులూ'' .. పబ్బుల్లోనూ .. ఫైవ్ స్టార్ బార్లలోనూ మత్తుగా గమ్మత్తుగా వూగుతున్న వేళ .. సిటీ కి కాస్త దూరంలో .. ఓ కార్పోరేట్ ఆఫీస్ లో సరిగ్గా రెండు గంటలా ఇరవై ఆరు నిమిషాలకి ల్యాండ్ లైన్ భయంకరంగా మోగింది .. సెక్యూరిటీ క్యాబిన్ ని దాటుకుని ఆ రింగ్ స్టాక్ సెక్షన్ కి ఆటోమేటిగ్గా ఫార్వర్డ్ అయింది .. నిజానికి ప్రతి కాల్ నీ ...ముందు తీయాల్సింది సెక్యూరిటీ ఆఫీసర్ గారే .. కానీ సదరు ఆ ఆఫీసర్ గారు కాస్త డోసు ఎక్కువ అవటం వల్ల పదకొండు గంటలకే సిన్సియర్ గా నిద్ర లోకి జారుకున్నారు .. ఇలా వారంలో ఆయన నైట్ డ్యూటీ వున్నప్పుడల్లా రెగ్యులర్ గా జరుగుతూనే వుంటుంది .. మిగిలిన నైట్ డ్యూటీ వేర్వేరు సెక్షన్ సిబ్బంది ఇతనిపై ఎన్నిసార్లు కంప్లయింట్ ఇచ్చినా అతన్ని మాత్రం జాబు నుంచి తీసేయలేదు .. పైగా అతను అటెండ్ కాకపోతే మీరేం పీకుతున్నారు .. మీరు కాల్స్ అందుకోండి .. మీకు కూడా బాధ్యత వుంది కదా అని పై ఆఫీసర్స్ పెద్ద క్లాసు .. ఎందుకంటే ఆ సెక్యూరిటీ ఆఫీసర్ ఆ కంపెనీ బాసు కి దగ్గరి బంధువు .. అందుకే ఏజెన్సీ నుంచి కాకుండా డైరెక్ట్ గా అప్పాయింట్ చేశారు .. సెక్షన్ ఆఫీసులో వున్న విశాల్ ఓ చేత్తో స్టాక్ బుక్ పట్టుకునే ల్యాండ్ లైన్ దగ్గరకి పరుగెత్తుకుని వెళ్ళాడు .. రిసీవర్ ఎత్తగానే వెంటనే గుర్తు పట్టాడు అతని భార్య గొంతుని . '' ఏంటి రీమా .. ఈ టైమ్ లో ఫోన్ చేశావు .. హెల్త్ బాగానే వుందా .. అయినా నా మొబైల్ కి చేయవచ్చు కదా ..'' అన్ని ప్రశ్నలూ సందేహాలూ ఒకేసారి అడిగేసాడు విశాల్ .. ''విషూ .. నువ్వు అర్జంటు గా ఇంటికి రా .. ప్లీజ్ .. నీ సెల్ కి ఇప్పటికి ఇరవై సార్లు అయినా చేసి వుంటా .. రింగ్ అవుతోంది కానీ లిఫ్ట్ చేయలేదు .. అందుకే నీ ఆఫీస్ కి చేశా .. నువ్వు అర్జంటు గా ఇంటికి రా ..'' అని రీమా చాలా కంగారుగా చెప్పేసరికి విశాల్ కి కాళ్ళూ చేతులూ వణికాయి.. గొంతులో ఏదో అడ్డు పడ్డట్టు అయింది .. ''ఏమైంది రీమా .. ఏంటి అంత కంగారు పడుతున్నావు .. ఆర్యూ ఓకే .. '' ఆ సెక్షన్ ఆఫీస్ ఫ్లోర్ మొత్తం దద్దరిల్లాయి అతని మాటలు .. కాకపోతే అది రాత్రి కాబట్టి ఎవరూ డ్యూటీ లో లేరు అతను తప్ప . '' విషూ .. మన ఇంట్లో ఇంకెవరో వున్నారు .. నాకు చాలా భయంగా వుంది .. నువ్వు వెంటనే ఇంటికి రా .. నేనూ .. మియా మన వీధిలో బయటే వున్నాం .. జల్దీ రా .. ప్లీజ్ ..'' అని చెప్పింది వణుకుతున్న స్వరంతో రీమా . దాదాపు గా ఏడుస్తూ చెప్పింది ఆమె . '' రీమా నువ్వుఏడవకు .. నువ్వు అసలే వట్టి మనిషివి కూడా కాదు .. నేను ఇప్పుడే స్టార్ట్ అవుతున్నా '' అని ధైర్యం చెప్పి ఫోన్ పెట్టేశాడు .. .. అంతే .. క్షణం ఆలోచించలేదు విశాల్ . జేబులు తడుముకున్నాడు .. అప్పుడు అర్ధమైంది .. బండి తాళం .. మొబైల్ ఫోన్ ఛార్జింగ్ కోసం కింద ఫ్లోర్ లో వున్న స్టోర్ రూమ్ లో ఫ్రిజ్ పైనే పెట్టి మర్చిపోయాను అని .. అందుకే తన భార్య ఎన్నిసార్లు చేసినా తనకి వినపడలేదు .. లోడు దిగిన స్టాక్ ని లెక్క పెట్టుకునే బిజీ లో ఏవీ గుర్తు లేదు తనకి . ఒక్క పరుగులో బండి తాళం , సెల్ ఫోన్ తీసుకుని బండి తీసి స్టార్ట్ చేశాడు విశాల్ .. యధా ప్రకారం సెక్యూరిటీ ఆఫీసర్ గుర్రు పెట్టి నిద్ర పోతూనే వున్నాడు ..తానే గేటు తీసుకుని బండిని ముందుకు పూరికించాడు విశాల్ . తన భార్య క్షేమంగా వుండాలని తాను ఎక్కువగా ఆరాధించే అరుణాచలం శివయ్యని మనసులోనే మొక్కుకున్నాడు ..భార్య పక్కనే మియా వుండటం కాస్త నయమే అనుకున్నాడు .. మియా అంటే వాళ్ళు ఆరు నెలలుగా పెంచుకుంటున్న పెట్ డాగ్.. తను పని చేసే కంపెనీ ఇంటికి యాభై నిమిషాల కంటే ఎక్కువగానే పడుతుంది బండి పై వస్తే . కానీ ఇప్పుడు కేవలం ఇరవై అయిదు నిమిషాల్లో ఇంటికి చేరుకున్నాడు .. భార్య రీమా ఆ ఇంటికి దగ్గరలో క్లోజ్ చేసిన షాపింగ్ మాల్ మెట్లపై ఓ మూలగా కూర్చుని వుంది .. కుక్క మియా ఒక్కసారిగా విశాల్ మీదకి ప్రేమగా దూకింది . రీమాని గాఢంగా హగ్ చేసుకున్నాడు .. ''మన ఇంట్లో దెయ్యం వుంది .. ఆ ఇంటికి రాను విషూ " అంటోంది రీమా .. ''ఇవాళ రేపు దెయ్యాలు ఎక్కడ వున్నాయే .. భయపడకు .. అంతా వట్టి ట్రాష్ .. పద .. ఇంటికి వెళ్దాం .. '' అని ఆమెని చాలా బుజ్జగించి ధైర్యం చెప్పి ఇంటికి తీస్కుని వెళ్ళాడు విశాల్.

కానీ రీమా ఇంట్లోకి వెళ్ళడానికి భయపడింది . మియా గేటు దగ్గర ఎవరో వున్నట్టుగా బాగా అరుస్తోంది .

దాని వెంట్రుకలన్నీ నిక్కబొడుచుకున్నాయి. తోక ముడుచుకుంది.ఇంటివైపు చూస్తూ గుర్రుమంది.

"మియా... ఏమైంది?"

విశాల్ దాని దగ్గరికి వెళ్లి నిమురబోయాడు. మియా అతని చేతిని కూడా పట్టించుకోకుండా ఇంటి రెండో అంతస్తు వైపు చూస్తూనే ఉంది. రీమా మాత్రం విశాల్ చేతిని గట్టిగా పట్టుకుంది."విషూ...

చూశావా?"

"ఏం?"

"మియా కూడా భయపడుతోంది."

విశాల్ నవ్వే ప్రయత్నం చేశాడు.

"కుక్కకి ఏదో శబ్దం వినిపించి ఉంటుంది."

"నాకు కూడా మొదట అదే అనిపించింది."

రీమా గొంతు వణికింది.

"కానీ... నేను ఈ ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడల్లా... ఎవరో నన్ను చూస్తున్నట్టుగా అనిపిస్తోంది."

విశాల్ తలుపు తెరిచాడు.

ఇంట్లో చీకటి.

లైట్ వేసాడు.

అంతా మామూలుగానే ఉంది.

సోఫా...

టేబుల్...

వంటగది...

బెడ్‌రూమ్...

ఎక్కడా ఎవరూ లేరు.

విశాల్ ఒక్కో గది చెక్ చేశాడు.

బాత్‌రూమ్.

బాల్కనీ.

స్టోర్‌రూమ్.

అన్నీ ఖాళీ.

"చూశావా? ఎవరూ లేరు."

రీమా ఏమీ మాట్లాడలేదు.

ఆమె చూపు మాత్రం బెడ్‌రూమ్ తలుపు పైనే ఉంది.

"ఏంటి?"" అక్కడ...""ఎక్కడ?"

"ఏమీ లేదు."ఆమె తల ఊపింది.అదే సమయంలో మియా ఒక్కసారిగా బెడ్‌రూమ్ వైపు చూస్తూ గట్టిగా మొరిగింది.విశాల్ తిరిగి చూశాడు. ఎవరూ లేరు.

కానీ...బెడ్‌రూమ్‌లో ఉన్న డ్రెస్సింగ్ టేబుల్ అద్దం మాత్రం నెమ్మదిగా కదులుతోంది.

విశాల్ దగ్గరకు వెళ్లి అద్దాన్ని పట్టుకున్నాడు.

కిటికీ తెరిచి ఉంది.

"గాలి వల్ల."అని చెప్పాడు.

రీమా మాత్రం నమ్మలేదు. కానీ ఎలాగో అలాగా ఆమెని హాల్లోని సోఫాలోనే తన ఒడిలోనే పడుకోబెట్టుకున్నాడు విశాల్ . ఆమె నిద్రలోకి జారుకుంది .. సోఫాలో మరో పక్కన మియా కుడా అతని పక్కనే పడుకుంది . కానీ కళ్ళు మాత్రం మూయలేదు . ఆ ఇద్దరి మధ్యా అలా శూన్యంలోకి చూస్తూ గతాన్ని తల్చుకున్నాడు విశాల్ .

తను రాజస్థాన్‌కి చెందినవాడు. సొంత వూరు జైసల్మేర్ జిల్లాలోని ఒక చిన్న గ్రామం , పేరు రామ్‌దేవ్రా. చిన్నప్పటి నుంచీ హైదరాబాద్ అంటే అతనికి ప్రత్యేకమైన ఇష్టం. MBA కోసం హైదరాబాద్‌కి వచ్చినప్పుడు రీమా పరిచయమైంది.

**ప్రేమగా మారిన స్నేహం**

ఇద్దరి కుటుంబాల నుంచి మొదట కొంత వ్యతిరేకత వచ్చినా చివరికి వాళ్లిద్దరూ పెళ్లి చేసుకున్నారు.

**హైదరాబాద్‌లోనే ఉద్యోగాలు చేసుకుంటూ జీవితం మొదలుపెట్టారు.పెళ్లయి రెండేళ్లు.**

ఇటీవలే రీమా గర్భవతి అయింది.అంతవరకూ తను పని చేసే కంపెనీకి దూరంగా శ్రీరామ్ నగర్లో వుండేవాళ్ళు . అది కంపెనీకి దాదాపు 45 కిలోమీటర్ల దూరంలో వుంది . పైగా హెవీ ట్రాఫిక్ . డ్యూటీ అయిపోయి ఇంటికి వెళ్లాలంటే విశాల్ కి రెండు గంటలకి పైగానే టైమ్ పట్టేది. భార్య కన్సీవ్ అవడంతో కంపెనీ కి ఇల్లు దగ్గరగా వుండాలనే వుద్దేశంతో ఈ ప్రాంతంలో వెతికారు .. అప్పుడే వాళ్లకు ఈ ఇల్లు దొరికింది..నగరానికి కొంచెం దూరంగా.చుట్టూ పెద్దగా ఇళ్లు లేవు. పై అంతస్తులో ఒక ముస్లిం కుటుంబం నివసిస్తోంది రఫీ అనే మధ్యవయస్కుడు...అతని భార్య... ఇద్దరు కొడుకులు...కోడళ్లు...చిన్న పిల్లలు. మొత్తం పదమూడు మంది వుంటారు . అంత చిన్న పోర్షన్ లో అంతమంది ఎలా వుంటారా అని అనిపిస్తుంది విశాల్ కి . ఇదే మాట రీమా తో అంటే ''ఇరుకులోనే సుఖం వుంటుంది విషూ '' అని కొంటెగా జవాబు చెప్పేది కన్ను గీటుతూ . ఇల్లు విశాలంగా ఉంది.అద్దె కూడా తక్కువ. అందుకే విశాల్ వెంటనే ఓకే చేశాడు.కానీ రీమా మాత్రం మొదటి రోజు నుంచే ఏదో అనుమానంగా చూసింది.

**"విషూ... ఈ ఇంట్లోకి అడుగు పెట్టగానే ఎందుకో నాకు బాగోలేదు."**

"కొత్త ఇల్లు కదా...

అలానే ఉంటుంది."

"లేదు."

"ఏంటి లేదు?"

"ఎవరో మనల్ని చూస్తున్నట్టు ఉంది."

విశాల్ నవ్వేశాడు.

"మన మీద అంత ఆసక్తి ఎవరికుంటుంది?"

రీమా కూడా నవ్వింది.

కానీ ఆ నవ్వు ఎక్కువసేపు నిలవలేదు.

దెయ్యం మొదటి జాడ ...

రాత్రి దాదాపు 2 గంటలు.

రీమా ఒక్కసారిగా నిద్రలోంచి లేచింది.

ఎవరో తన పేరు పిలిచినట్టు అనిపించింది.

"రీమా..."

ఆమె కళ్లు తెరిచింది.

పక్కనే విశాల్ గాఢంగా నిద్రపోతున్నాడు.

"రీమా..."

ఈసారి శబ్దం స్పష్టంగా వినిపించింది.

బెడ్‌రూమ్ బయట నుంచి.

ఆమె నెమ్మదిగా మంచం దిగింది.

తలుపు దగ్గరకు వెళ్లింది.

చేయి తలుపు హ్యాండిల్ మీద పెట్టగానే...

మియా గట్టిగా మొరిగింది.

రీమా భయంతో వెనక్కి వచ్చింది.

మరుసటి రోజు విశాల్‌కి చెప్పింది.

అతను పెద్దగా పట్టించుకోలేదు.

కానీ ఆ తర్వాత అలాంటి సంఘటనలు తరచూ జరగడం మొదలైంది.

వంటగదిలో గ్లాసు పడటం. ఒక్కోసారి వండిన వంటలన్నీ కిచెన్ నిండా విసిరేసినట్టు పడి వుండటం..

బెడ్‌రూమ్ తలుపు తనంతట తానే మూసుకోవడం.రాత్రిళ్లు మెట్ల మీద ఎవరో నడిచినట్టు శబ్దం వినిపించడం .. ఇలా ఎన్నో జరిగాయి.. ''నువ్వు హర్రర్ సినిమాలు చూడ్డం మానేయ్'' అని సింపుల్ గా చెప్పేవాడు విశాల్ .. వీటి గురించి చెప్తే !

మరింత విచిత్రం...

*మియా ఎప్పుడూ ఇంట్లో ఒకే చోటికి చూస్తూ మొరిగేది.*

అది డ్రెస్సింగ్ టేబుల్ వైపు వున్న ప్రదేశం ...

రీమా గర్భవతి అని తెలిసి విశాల్ తల్లి ఆంచల్ రాజస్థాన్ నుంచి హైదరాబాద్ వచ్చింది.

మొదట కోడలిని చూసి ఆంచల్ చాలా సంతోషించింది. తనకిష్టమైన మోహంతాల్ అనే రాజస్థానీ సంప్రదాయమైన స్వీట్స్ ని తీసుకువచ్చి కోడలికి ఇచ్చింది ..

ఆంచల్ వచ్చిన మొదటి రెండు రోజులు బాగానే వుంది.. కానీ మూడో రోజు రాత్రి దెయ్యం ఆట మొదలైంది ..

ఆంచల్ అర్ధరాత్రి బాత్‌రూమ్‌కి వెళ్లి వస్తుండగా...తలుపు వెనకాల ఓ నల్లటి ఆకారం కనిపించింది.ఆమె కళ్లను నులుముకుంది.

ఆ ఆకారం అక్కడే ఉంది.

"ఎవరు?"అది కదలలేదు.

ఆమె ఒక్క అడుగు ముందుకు వేసింది.

ఆ ఆకారం నెమ్మదిగా తల తిప్పింది.

ఆమెకు ముఖం కనిపించలేదు.

కేవలం రెండు తెల్లటి కళ్లలా ఏదో మెరిసింది.

తమ రాష్ట్రంలో ప్రసిద్ధమైన మెహందీపూర్ బాలాజీ హనుమాన్ ఆలయాన్ని తల్చుకుంది .. మనసులో బాలాజీ హనుమాన్ ని మొక్కింది .. ఇలాంటి భూతాలకి దెయ్యాలకి చెడు శక్తులకి మెహందీపూర్ బాలాజీ హనుమాన్ అంటే హడల్ అని పేరుంది . ''జై బాలాజీ హనుమాన్ '' అని ఆమె గట్టిగా అరవడంతో విశాల్, రీమా పరుగెత్తుకుంటూ వచ్చారు.

లైట్ వేసేసరికి...అక్కడ ఎవరూ లేరు.

మరుసటి రోజే విశాల్ తల్లి తన వెంట తెచ్చుకున్న తావీదును రీమా చేతికి కట్టింది.

"ఇది సాధారణ ఇల్లు కాదు.""అమ్మా..."

"నేను చెప్పేది విను. ఈ ఇల్లు ఖాళీ చేయండి."

అదే రాత్రి మరో సంఘటన జరిగింది.

రీమా నిద్రపోతుండగా ఎవరో ఆమె గొంతు దగ్గర చేతులు పెట్టినట్టు అనిపించింది. ఎవరో తన గొంతుని నొక్కేస్తున్నారు .. గట్టిగా విషూ అని పిలుద్దామని అనుకుంది .. కానీ గొంతు పెగలటం లేదు .. మంచం మీద నుంచి లేద్దాం అనుకుంది .. కానీ లేవలేక పోతోంది .. ఒక్కసారిగా శక్తి మొత్తం తెచ్చుకుంది గట్టిగా కేక వేసింది ..

విశాల్ లేచేలోపు ఆమె మంచం నుంచి కింద పడిపోయింది.

ఆమె మెడపై మూడు ఎర్రటి గీతలు. ఆమె మెడలో వేసిన తావీదు ఎక్కడా కనిపించలేదు .. "విషూ.. నా పీక ఎవరో పిసికారు.. నిన్ను పిలుద్దాం అనుకున్నా గొంతు పెగల్లేదు ... నాకు చాలా భయంగా వుంది .. గుండె దడగా వుంది '' అంది రీమా వణికిపోతూ .

అది విన్న విశాల్ తల్లి భయంతో కంపించిపోయింది .. ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది . "నేను ఇక్కడ ఒక్కరోజు కూడా ఉండను." అంది ఆంచల్ ."అమ్మా..నువ్వు కూడా రీమాలాగే భయపడితే ఎలా .. తనకి ఏదో స్లీపింగ్ పెరాలసిస్ వచ్చింది .. చాలామందికి నిద్రలో ఇలాగే అవుతుంది .. ఒకే వైపు కి తిరిగి చాలా సేపు పడుకుంటే వచ్చే జెనరల్ నెర్వస్ ప్రాబ్లెమే ఇది .." తనకి తెలిసిన నాలెడ్జి తో చెప్పాడు విశాల్ . కానీ మరుసటి ఉదయమే ఆమె రాజస్థాన్ వెళ్లిపోయింది.

వెళ్లే ముందు మాత్రం ఒక్క మాట చెప్పింది.

*"విశాల్...

ఇల్లు మార్చు."*

విశాల్ కుటుంబానికి నిజమైన అండగా నిలిచింది పై అంతస్తులో ఉన్న రఫీ కుటుంబమే. ఇదివరకు అతను దుష్ట శక్తుల్ని సైతాన్ ని పారదోలే మంత్రం వేసేవాడని చుట్టుపక్కలవాళ్ళు కొందరు చెప్పగా విన్నాడు విశాల్ .

రఫీ భాయ్ చాలా మంచివాడు. వాళ్ళ ఫ్యామిలీ మెంబర్స్ కూడా చాలా బాగా స్నేహంగా వుంటారు ..

"భాయ్...

ఏదైనా సమస్య ఉంటే పిలవండి."

అని అనేవాడు విశాల్ తో.

అతని పెద్ద కోడలు సైరా ..

రీమాతో స్నేహంగా ఉండేది.

చిన్న కోడలు గౌసియా కూడా రీమా గర్భం గురించి ఎంతో జాగ్రత్తగా చూసేది.

ఒకరోజు రఫీ రీమాతో అన్నాడు.

"అమ్మా... ఈ ఇంట్లోకి వచ్చిన వాళ్లందరూ మొదట్లో బాగా భయపడతారు ."

రీమా ఒక్కసారిగా షాకింగ్ గా ఆయన వైపు చూసింది .

"నీకేమైనా భయం అనిపించిందా అమ్మా "

అది తనని భయపెట్టాలని చెప్పటం లేదు .. ధైర్యం ఇవ్వడానికే అన్నట్టుగా అనిపించింది .. కానీ ఎందుకో చెప్పాలనే ఆలోచన రాలేదు రీమాకి . "ఏమీ లేదు." పైకి మాత్రం అంది .

"చెప్పండి.పర్లేదు అమ్మా .. నేను మీ చిచ్చాలాంటి వాడినే '' "రాత్రిళ్లు శబ్దాలు వస్తాయి... అంతే."

ఈసారి చెప్పేసింది .

"మీకు ఏదైనా ఆకారం కనిపించిందా?"

రఫీ అడిగాడు రీమాని . రీమా చెప్పబోయింది.

కానీ రఫీ ఆమెను ఆపేశాడు."అమ్మా... రాత్రిళ్లు ఏదైనా కనిపించినా దాని దగ్గరకు వెళ్లకండి."

ఆ మాటలు రీమా మనసులో మిగిలిపోయాయి.

రీమా ఇచ్చిన ఛాయ్ తాగి కప్పు టీపాయ్ మీద పెడ్తూ వెళ్ళాడు రఫీ. వెళ్తూ వెనక్కి తిరిగి ఇలా అన్నాడు. "రేపు నా దగ్గర వున్న తావీదు తీసుకు వస్తాను .. మెడలో వేసుకోండి అమ్మా '' అని వెళ్ళిపోయాడు . నిజంగా ఆయన్ని చూస్తే చాలా బలం వచ్చినట్టు అనిపించింది రీమాకి .

కానీ ఆ బలం కొన్ని గంటల్లో మాయమైపోతుంది అని ఆమెకి ఆ క్షణం తెలియదు ...!!

మర్నాడు తెల్లవారుజామున...

పోలీసుల జీపు ఇంటి ముందు ఆగింది.

విశాల్ బయటకు వచ్చాడు.

పై అంతస్తులో రఫీ చనిపోయాడు.

ఎవరికీ అర్థం కాలేదు అతను ఎందుకు ఎలా చనిపోయాడో .. బయట నుంచి తలుపు లాక్.

లోపల రఫీ.శరీరంపై పెద్దగా గాయాలు లేవు.

కానీ ముఖంలో మాత్రం... భయం.

అతను చనిపోయే ముందు ఏదో చూసినట్టుగా కళ్లు పెద్దవిగా తెరిచి ఉన్నాయి. అతని చేతిలో మొలదారానికి కట్టిన తావీదు వుంది ..

రీమా ఆ దృశ్యం చూసి వణికిపోయింది.

ధైర్యం చెప్పిన రఫీ అంకులే దూరమయ్యాడు .. ఆయన ఖననం తర్వాత కూడా ఆమెకు నిద్ర పట్టలేదు.

*ఒక వారం తర్వాత*

రఫీ పెద్ద కోడలు సైరా మెట్ల మీద నుంచి కింద పడిపోయింది.

ఆమె పడిన విధానం చూసిన వాళ్లందరికీ అనుమానం వచ్చింది.

మెట్లపై జారిపోయినట్టు కాదు.

ఎవరో వెనుక నుంచి తోసినట్టుగా ఉంది.

ఆమె అక్కడికక్కడే రక్తం కక్కుకుని చనిపోయింది.

ఇంట్లో విషాదం.

రీమా భయంతో విశాల్‌ని పట్టుకుని ఏడ్చింది.

"ఇంకా ఇక్కడ ఉండకూడదు విషూ."

"మనం వెళ్దాం."

"ఎప్పుడు?"

"వెంటనే."

కానీ ఇల్లు ఖాళీ చేయడం అంత సులభం కాలేదు.

ఓనర్ సమస్య.

అడ్వాన్స్ సమస్య.

కొత్త ఇల్లు దొరకడం లేదు.

విశాల్ ఉద్యోగం. ఈ మధ్య ఓటీ లు బాగా ఎక్కువయ్యాయి. నిద్ర కరువైంది .. పోనీ రెంటల్ బ్రోకర్ కి చెబుదామంటే ఎలాంటి ఇల్లు చూపిస్తాడో .. ఎంత కమీషన్ అడుగుతాడో .. అసలే జీతం తక్కువ .. పైగా రీమా ప్రెగ్నెంట్ .. హెల్త్ చెకప్స్ .. టెస్టులు.. బహుశా పద్మవ్యూహం అంటే ఇదేనేమో అనుకున్నాడు విశాల్ .

ఇవన్నీ కల్సి ఆ దెయ్యం ఇంటి నుంచి ఖాళీ చేయలేకపోయారు ..

కానీ కాలం ఎవరి దయ కోసం ఆగదు ... రోజులు బాగున్నా లేకున్నా తన పని తాను చేసుకుంటూ వెళ్ళిపోవడం కాల ధర్మం ...

కొన్ని రోజుల తర్వాత...

రఫీ చిన్న కొడుకు కూతురు రుక్సానా ..

మూడేళ్ళ చిన్న పాప.

ఇంటి ముందు ఆడుకుంటోంది.

ఆమెతో ఆడుకుంటున్న వేరే పిల్లల నవ్వులు వినిపించాయి.

అచానక్ .. ఒక్కసారిగా నిశ్శబ్దం.

పాప నేలపై పడిపోయింది. రుక్సానా మెడ అసహజంగా వెనక్కి వంగిపోయింది.

తల నేలకి బలంగా తగిలింది.

ఒక్కసారి... రెండుసార్లు... మూడుసార్లు...

ఎవరో ఆమె తలను నేలకేసి కొట్టినట్టుగా ఆ పాప తన తలని తానే నేలకేసి బాదుకుంటూ వుంది .. అది కూడా వెనక్కి తిరిగిన తలతో ..!!

అక్కడ ఉన్నవాళ్లంతా షాక్.

ఎవరికీ ఏమీ అర్థం కావటంలేదు .. . అదేదో సినిమాలో సీన్ లోని vs ఎఫెక్ట్ లా లాగా అందరూ ఫ్రీజ్ అయిపోయారు .. కానీ పాప మాత్రం తల బాదుకుంటూనే వుంది .. చివరిగా నేల మీద వాల్చిన తల మళ్లీ పైకి ఎత్తలేదు.. చూస్తే చనిపోయి వుంది ..

ఆ రోజు రాత్రి విశాల్ ఒక నిర్ణయం తీసుకున్నాడు. "రేపు ఏమైనా అయినా సరే...మన ఇల్లు మారిపోతాం.

**" *కానీ ఆ రాత్రే...*

విశాల్ నిద్రపోతుండగా మియా ఒక్కసారిగా గట్టిగా మొరిగింది.విశాల్ కళ్లు తెరిచాడు.

రీమా పక్కన లేదు."రీమా?"

బెడ్‌రూమ్ తలుపు తెరిచి ఉంది.బయటికి వచ్చాడు.రీమా ఇంటి బయట మెట్ల దగ్గర నిలబడి ఉంది.ఎదురుగా...

చీకటి."రీమా!"

ఆమె కదలలేదు.

"రీమా!"

విశాల్ దగ్గరకు వెళ్లి ఆమె భుజాన్ని పట్టుకున్నాడు.ఆమె ఒక్కసారిగా అతని వైపు తిరిగింది.కళ్లు మూసుకుని ఉన్నాయి.

"రీమా!"ఆమె కళ్లను తెరిచింది.

"నేను ఇక్కడికి ఎలా వచ్చాను?"

విశాల్ గుండెలో చలి పుట్టింది.

అతను ఆమెను గట్టిగా కౌగిలించుకున్నాడు.

అదే సమయంలో...

మెట్ల కింద నుంచి ఒక శబ్దం.*"విశాల్..."*అతను ఒక్కసారిగా ఆగిపోయాడు.ఆ గొంతు...

అతని తల్లి గొంతులా ఉంది.

కానీ ఆమె రాజస్థాన్‌లో ఉంది.

"విశాల్..." మరోసారి.

మియా మెట్ల వైపు చూసి గట్టిగా మొరిగింది.

విశాల్ రీమాను తీసుకుని గదిలోకి పరుగెత్తాడు.

దెయ్యాన్ని పరార్ చేసిన హనుమాన్

ఆ మరుసటి రోజు విశాల్ తన మేనమామ రణవీర్ కి ఫోన్ చేశాడు.

అతను రాజస్థాన్‌లో మెహందీపూర్ బాలాజీ స్వామి భక్తుడు. హనుమాన్ ని ఉత్తరాది ప్రజలు బాలాజీ అని కూడా పిలుస్తారు .. బాలాజీ అంటే మనకి తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి కదా .. అక్కడ బాలాజీ అంటే హనుమాన్ కూడా !!

విశాల్ మొత్తం విషయం చెప్పాడు.

మేనమామ చాలా సేపు ఏమీ మాట్లాడలేదు.

తర్వాత ఒకటే మాట అన్నాడు.

"విశాల్... భయపడకు. నేను రేపే మెహందీపూర్ బాలాజీ మందిరానికి వెళ్తాను."

రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో, జైపూర్ నుండి 110 కిలోమీటర్ల దూరంలో ఉన్న మెహందీపూర్ గ్రామంలో శ్రీ హనుమంతునికి అంకితం చేసన బాలాజీ ఆలయం ఉంది. ఈ ప్రదేశం హనుమంతుని బాల్యాన్ని వర్ణిస్తుంది కాబట్టి దీనికి బాలాజీ అని పేరు వచ్చింది. (హిందీలో 'బాల్' అంటే బాలుడు). ఈ ఆలయం యొక్క ప్రత్యేకత ఏమిటంటే, ఇది భూతవైద్యానికి ప్రసిద్ధి చెందింది. ఫలితంగా, భారతదేశం నలుమూలల నుండి ప్రజలు దుష్టశక్తుల నుండి విముక్తి పొందడానికి ఈ ప్రదేశానికి తరలివస్తారు.

కొన్ని రోజుల తర్వాత విశాల్ మేనమామ రణవీర్ హైదరాబాద్ వచ్చాడు.

తనతో పాటు బాలాజీ ఆలయం నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక సింధూరం తెచ్చాడు.

రీమా నుదుటిపై పెట్టాడు.

విశాల్‌కూ పెట్టాడు.

ఇంటి ప్రధాన తలుపు దగ్గర కూడా సింధూరం పెట్టాడు.

అతను ఏ మంత్రం చదివాడో వాళ్లకు అర్థం కాలేదు.

కానీ ఆ రాత్రి...

*మొదటిసారి మియా మొరగలేదు.*

రోజులు గడిచాయి.

ఇంట్లో విచిత్రమైన సంఘటనలు తగ్గిపోయాయి.

రీమాకు రాత్రిళ్లు ఎవరో పిలుస్తున్నట్టు వినిపించలేదు.

మెట్ల దగ్గర అడుగుల శబ్దాలు ఆగిపోయాయి.

మియా మళ్లీ మామూలుగా మారింది.

అప్పుడే విశాల్‌కు కొత్త ఇల్లు దొరికింది.

ఎలాంటి ఆలస్యం చేయకుండా వాళ్లు ఆ ఇంటిని ఖాళీ చేశారు.

రీమా ఆ దెయ్యం ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు ఒక్కసారి వెనక్కి తిరిగి చూసింది.

ఇంటి రెండో అంతస్తులోని కిటికీ తెరిచి ఉంది.

కర్టెన్ గాలికి కదులుతోంది.

ఆమెకు...

కిటికీ వెనుక ఎవరో నిలబడి ఉన్నట్టు అనిపించింది.

"విషూ...""ఏంటి?""ఏమీ లేదు." ఎందుకో ఆ కిటికీ విషయం చెప్పానిపించలేదు ..

ఇక ఆమె వెనక్కి తిరిగి చూడలేదు.

విశాల్ మాత్రం చూసాడు.

అక్కడ ఎవరూ లేరు.కొత్త ఇంటిలో బుల్లి హనుమాన్ ...కొత్త ఇంట్లో రీమా ప్రశాంతంగా ఉంది.కొన్ని నెలల తర్వాత పండంటి బిడ్డ పుట్టాడు .. విచిత్రమేమిటంటే .. హనుమాన్ జన్మ నక్షత్రమైన పూర్వాభాద్ర నక్షత్రంలోనే ఆ మగబిడ్డ జన్మించాడు .. అంతా హనుమాన్ దయ అనుకున్నారు .. ఆ ఇంట్లో మళ్లీ నవ్వులు. మియా కూడా బిడ్డ చుట్టూ తిరుగుతూ కాపలా కాస్తోంది.విశాల్ తన మేనమామకు ఫోన్ చేశాడు.మామా... ఇప్పుడు అంతా బాగుంది.

అవతల నుంచి నవ్వు."బాలాజీ హనుమాన్ కృప."విశాల్ కాసేపు మౌనంగా ఉన్నాడు.

"మామా...""ఏంటి?""ఆ ఇంట్లో నిజంగా దెయ్యం ఉందా?"అవతల మౌనం.చాలా సేపటి తర్వాత మేనమామ అన్నాడు.*"నువ్వు ఆ ఇంటిని వదిలి వచ్చావు కదా... ఇక ఆ ప్రశ్నకు సమాధానం ఎందుకు?"*విశాల్ నవ్వాడు.కానీ ఆ మాట అతని మనసులో మిగిలిపోయింది. *కొన్ని సంవత్సరాల తర్వాత...*

విశాల్ ఒకరోజు తన పాత స్నేహితుడిని కలవడానికి తమ పాత ఇంటి ప్రాంతానికి వెళ్లాడు.

ఓ ఫ్రెండ్ ని కలిశాక తన పాత ఇంటి వైపు అనుకోకుండా వెళ్లాడు.

అక్కడికి వెళ్లి చూస్తే...*ఆ ఇల్లు ఇంకా అలాగే ఉంది.*కానీ బయట కొత్త పెయింట్.

కొత్త గేటు.కొత్త బోర్డు.ఎవరైనా కొత్తగా వచ్చి ఉంటారని అనుకున్నాడు.

అతను అక్కడి నుంచి వెళ్లిపోవడానికి తిరిగాడు.

అప్పుడే...అతని మొబైల్ మోగింది.

స్క్రీన్‌పై పేరు చూసి అతను కాస్త కంగారు పడ్డాడు ..

*"రీమా."

*అతను ఫోన్ ఎత్తాడు.

"హలో.. రీమా .. చెప్పు ?"

అవతల రీమా గొంతు.

"విషూ...

నువ్వెక్కడ ఉన్నావు?""

నేను బయట ఓ చోట ఉన్నాను."

"ఎక్కడ?"

విశాల్ ఆ ఇంటి వైపు చూస్తూ చెప్పాడు.

"మన పాత ఇంటి దగ్గర !... హే .. రీమా .. నీకో విషయం తెల్సా .. మనం ఖాళీ చేసిన తర్వాత రఫీ అంకుల్ వాళ్ళ ఫ్యామిలీ మెంబర్స్ కూడా వెకేట్ చేసి వెళ్లిపోయారుట .. ఇందాక మా ఫ్రెండ్ చెప్పాడు "

రీమా వైపు నుంచి కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

తర్వాత రీమా భయంతో అంది.

*"విషూ... వెంటనే అక్కడి నుంచి వచ్చేయ్."*

"ఎందుకు?"

"నాకు ఇందాకే ..."ఆమె మాట ఆగిపోయింది.

"ఏమైంది?"రీమా నెమ్మదిగా అంది.

*"మన మియా... ఇప్పుడే ఆ ఇంటి గేటు దగ్గర నిలబడి మొరుగుతున్నట్టు నాకు పగటి కల వచ్చింది."*విశాల్ గుండెలో ఒక్కసారిగా చలి పుట్టింది.

మళ్లీ ఎందుకొచ్చిన గొడవ అని అక్కడి నుంచి బయలు దేరాడు విశాల్ . అతని కళ్ల ముందు... ఆ పాత ఇంటి రెండో అంతస్తు కిటికీ కర్టెన్ నెమ్మదిగా కదిలింది.గాలి లేదు.

కిటికీ మూసి ఉంది.కర్టెన్ మాత్రం...*లోపలి నుంచి ఎవరో నెమ్మదిగా పక్కకు జరిపినట్టుగా కదిలింది.*విశాల్ అక్కడి నుంచి ఒక్క అడుగు వెనక్కి వేశాడు.అంతలో...కిటికీ అద్దంలో ఒక ఆకారం కనిపించింది.మనిషి ఆకారం.

కానీ ముఖం కనిపించలేదు.విశాల్ కదలలేకపోయాడు.అది కేవలం రెండు సెకన్లు మాత్రమే. తర్వాత కిటికీ ఖాళీ.అతను తనను తాను సముదాయించుకున్నాడు."బహుశా భ్రమ..."

అని వెనక్కి తిరిగి నడిచాడు.కానీ...

అతను వెళ్లిపోయిన తర్వాత...

ఆ ఇంటి రెండో అంతస్తు కిటికీ మళ్లీ నెమ్మదిగా తెరుచుకుంది.లోపల నుంచి ఒక అమ్మాయి నవ్వు వినిపించింది.*"హా... హా... హా ..."*.. అది విశాల్ కి వినిపించలేదు ..

క్లోజ్ షాట్ .. not closeup shot !!

**ఆ ఇల్లు ఖాళీ అయింది...

విశాల్ కుటుంబం అక్కడి నుంచి వెళ్లిపోయింది...ఆ తర్వాత అక్కడ ఎవరెవరు వచ్చారు, ఏమేమి జరిగాయో ఎవరికీ తెలియదు.**

*రఫీ కుటుంబంలో జరిగిన వరుస మరణాలకు ఇప్పటికీ పూర్తిగా సమాధానం లేదు.*

*విశాల్ కుటుంబం మాత్రం ఆ ఇంటిని ఎప్పటికీ మర్చిపోలేదు. ఎందుకంటే వాళ్లు ఒక విషయం మాత్రం ఇప్పటికీ చెప్పలేరు...*

"ఆ ఇంట్లో నిజంగా దెయ్యం ఉందా...?

లేక...

దెయ్యం పేరుతో ఎవరో మనుషులే ఆ మరణాల వెనుక ఉన్నారా...?"

ఆ ప్రశ్నకు సమాధానం మాత్రం...

ఆ ఇల్లు ఇప్పటికీ తనలోనే దాచుకుంది.**

నిజానికి అసలేం జరిగింది ??

ఇది రద్దయిన రెండు వేల రూపాయల ప్రశ్న !!

(ఇది హైదరాబాద్ లో కొన్నాళ్ళ క్రితం నిజంగా జరిగిన ఉదంతం .. సామాజిక సమాచార బాధ్యత ప్రకారం వ్యక్తుల పేర్లు మార్చామని మనవి . మిగిలినది అంతా యధార్థం . వచ్చే వారం మరో రియల్ స్టోరీ కోసం రెడీ గా వుండండి )